## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో ద్వితీయ స్థానం

కామారెడ్డి అర్బన్: సోమవారం హనుమకొండలో ని ర్వహించిన సెపక్ తక్రా సీఎం కప్ రాష్ట్ర స్థాయి ఫైన ల్ పోటీల్లో కామారెడ్డి–హైదరాబాద్ జిల్లాల బాలిక ల జట్లు తలపడగా జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, నరేష్ తెలిపారు. హైదరాబాద్ బాలికల జట్టుతో హోరాహోరిగా జరిగిన పోటీ ల్లో 14–15, 12–15 పాయింట్లతో రెండో స్థానంతో తృప్తి పడాల్సి వచ్చిందన్నారు. శ్రీనివాస్, వికాస్‌లు కోచ్‌లుగా వ్యవహరించారు.

### విద్యార్థులకు వైద్య పరీక్షలు



కామారెడ్డి అర్బన్: సామాజిక, విద్యా, వైద్య సేవల్లో కామారెడ్డి రోటరీ క్లబ్ ముందుందని అధ్యక్షుడు పి.రాజనర్సింహారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో రోటరీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు, అవగాహన సమావేశం నిర్వహించారు. రోటరీ గౌరవ డాక్టర్లు వి.విజయ్‌కుమార్, కే.వెంకటరాజం, బెల్లపు బాలరాజ్, విద్యాసాగర్‌లు వైద్య పరీక్షలు చేశారు. రోటరీ ప్రతినిధులు సబ్బని కృష్ణహరి, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

### పార్టీ బలోపేతానికే బూత్ కమిటీ సభ్యుల ఎన్నిక



రాజంపేట: బీజేపీ బలోపేతానికే గ్రామ స్థాయిలో బూత్ కమిటీ సభ్యుల నియామకాలు చేపడుతున్నట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం తలమడ్లలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించి 151బూత్ అధ్యక్షుడిగా బాలయ్య, 152వ బూత్ అధ్యక్షుడిగా సంజీవ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

**క్యాసంపల్లిలో కార్యకర్తల సమావేశం**

కామారెడ్డి రూరల్: క్యాసంపల్లి, రాఘవపూర్ గ్రామాల్లో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థాగత మార్పుల్లో భాగంగా 174వ బూత్ అధ్యక్షుడిగా గుగులోత్ నరేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్‌కే, ఎస్ఆర్‌కే, వీఆర్‌కే డిగ్రీ, పీజీ కళాశాలలకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్‌కేలో తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరి రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. విద్యా సంస్థల కరస్పాండెంట్ జైపాల్ రెడ్డి, ప్రిన్సిపల్స్ దత్తాత్రి ,సైదయ్య, నవీన్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, గంగాధర్, తిరుపతి రెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

దోమకొండ: దోమకొండ మాజీ సర్పంచ్ దీకొండ రాంచంద్రం(73) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. 1995 నుంచి 2001 వరకు ఆయన గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. కొంత కాలంగా అనారోగ్యంగా బాధపడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీలో చురుకుగా పనిచేశారు. ఆయన తర్వాత ఆయన కోడలు దీకొండ శారద సైతం సర్పంచ్‌గా పనిచేశారు. అంత్యక్రియలు మంగళవారం నిర్వహించనున్నారు.

### నిబంధనలకు లోబడి వేడుకలు జరుపుకోవాలి

గాంధారి/ఎల్లారెడ్డి/తాడ్వాయి: డిసెంబర్ 31న వేడుకలను నిబంధనలకు లోబడి శాంతియుతంగా జరుపుకోవాలని గాంధారి, తాడ్వాయి, ఎల్లారెడ్డి ఎస్సైలు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, మహేశ్, వేర్వేరుగా కోరారు. యువకులు అల్లర్లు చేయకుండా శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. మంగళవారం సాయంత్రం నుంచి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలుంటాయన్నారు.

### డ్రగ్స్ జోలికి వెళ్తే కఠిన చర్యలు

దోమకొండ: యువత గంజాయి లాంటి డ్రగ్స్ జోలికి వెళ్లవద్దని, అదేవిధంగా అనుమతి లేని ప్రదేశాలో మద్యం తాగినా కఠినచర్యలు తీసుకుంటామని దోమకొండ ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావ్ అన్నారు. సోమవారం దోమకొండలో మాట్లాడారు. ఫంక్షన్ హాల్స్‌లో మద్యం వినియోగించటానికి ఎక్సైజ్ శాఖ నుంచి కచ్చితంగా అనుమతి తీసుకోవాలన్నారు.

# ఇంటి భోజనమే దిక్కు!

- జప్తిజాన్కంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదు నెలలుగా నిలిచిన మధ్యాహ్న భోజన పథకం
- ఇంటి నుంచి టిఫిన్లు తెచ్చుకొని తింటున్న విద్యార్థులు



జప్తిజాన్కంపల్లి పాఠశాలలో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్న విద్యార్థులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : జప్తిజాన్కంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదు నెలలుగా మధ్యాహ్న భోజన పథకం అమలుకావడంలేదు. ఫలితంగా పాఠశాల విద్యార్థులకు ఇంటి భోజనమే దిక్కయింది. భోజనం వండేందుకు గ్రామంలో ఎవరూ ముందుకు రాకపోవడంతో పాఠశాలలో మధ్యాహ్న భోజన పథం అమలు కావడంలేదని తెలిసింది. పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు మొత్తం 63 మంది విద్యార్థులున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఈ యేడు ఆగస్టు 5న ప్రారంభించారు. పథకం ఐదు రోజుల తర్వాత నిలిచిపోయింది. సుమారు 5 నెలలుగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు కావడంలేదు.

**కొంతమందికి ఉపవాసం తప్పడంలేదు..**

పాఠశాలలో చదివే విద్యార్థులలో కొంతమంది గ్రామంలోని ఇళ్లకు వెళ్లి మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. కాగా కొన్ని సందర్భాలలో విద్యార్థుల తల్లిదండ్రులు సొంత పనుల నిమిత్తం ఇళ్లకు తాళాలు వేసి వెళ్లినప్పుడు టిఫిన్ తెచ్చుకోకుండా పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఉపవాసం తప్పడంలేదు. పాఠశాలలో నిలిచిపోయిన మధ్యాహ్నభోజనం పథకాన్ని అమలు చేసేందుకు మండలస్థాయి అధికారులెవరూ ప్రయత్నం చేయకపోవడం గమనర్హం . ఉన్నతాధికారులు దృష్టి సారించి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలయ్యేలా చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

**భోజనం వండేందుకు రావడంలేదు**

పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వండేందుకు పలుమార్లు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాం. కాని వండేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించలేకపోతున్నాం. ఇటీవలే మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బియ్యం పాఠశాలకు తెప్పించాం. వారం రోజుల్లో పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయించేందుకు ప్రయత్నం చేస్తాం.

– అనసూజ, యూపీఎస్ హెచ్‌ఎం, జప్తిజాన్కంపల్లి

# గ్రంథాలయాల అభివృద్ధే లక్ష్యం

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి
- గంటల వ్యవధిలో గ్రంథాలయంలో సమస్యలు తీర్చిన చైర్మన్



విద్యార్థులతో చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి

బిచ్కుంద(జుక్కల్): జిల్లాలోని అన్ని గ్రంథాలయాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, నిధులు తీసుకొచ్చి సమస్యలు పరిష్కరిస్తామని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం బిచ్కుంద గ్రంథాలయం సందర్శించి డీఎస్సీ, టెట్, ఇతర ఉద్యోగాల కోసం లైబ్రరీలో చదువుకుంటున్న విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నీరు, ఇంటర్‌నెట్, వైఫై కావాలి, బుక్స్ కావాలని విద్యార్థులు కోరారు. వెంటనే చైర్మన్ స్పందించి ఆయనకు పరిచయం ఉన్న మెడికల్ నిర్వాహకుడు శేఖర్‌తో మాట్లాడి అప్పటికప్పుడు రూ.15 వేల ఖర్చుతో అరగంటలో నెట్, వైఫై సౌకర్యం కల్పించారు. జీపీ అధికారులతో మాట్లాడి పైపులైన్ వేయించి నీటి వసతి కల్పించారు. ఫోన్‌లో డీఈవోతో మాట్లాడి నాలుగు సెట్ల పుస్తకాలు తెప్పించారు. గంటల వ్యవధిలో సమస్యలు పరిష్కరించిన చైర్మన్ చంద్రకాంత్ రెడ్డిని విద్యార్థులు సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ..జిల్లాలో జీపీల నుంచి రూ.2 కోట్ల 45 లక్షల సెస్సు రావాల్సి ఉందన్నారు. అనంతరం ఆయన 20 కుర్చీలు గ్రంథాలయానికి అందించారు. పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గంగాధర్, శేఖర్, ఖలీల్ తదితరులు ఉన్నారు.

### సంగోజీవాడి పాఠశాల తనిఖీ



సాక్షి ఎఫెక్ట్..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): సంగోజీవాడి ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఎంఈవో రామస్వామి తనిఖీ చేశా రు. ఈ నెల 28న సాక్షిలో 'వరండాలో చదు వులు' అనే శీర్షికన ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఎంఈవో రామ స్వామి పాఠశాలకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలకు దూరంగా నిర్మించి వృథాగా ఉన్న అదనపు గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. సమస్య గురించి జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశారు. ప్రధానోపాధ్యాయుడు మురళి ఉన్నారు.

### ఘనంగా ఎలమాస పండుగ



మద్నూర్(జుక్కల్): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రజలు ఎలమాస పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు ఎడ్ల బండ్లపై వ్యవసాయ పొలాలకు వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వన భోజనాలు చేశారు.

**మల్కాపూర్‌లో..**

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని మల్కాపూర్ శివారులో సోమవారం ఎలమాస పండగ ఉత్సవాలను రైతులు ఘనంగా నిర్వహించారు. పంటలు సమృద్ధిగా పండి రైతులందరూ సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సంతోష్,శామప్ప పటేల్, మాజీ ఎంపీటీసీ నరహరి పాల్గొన్నారు.

### ఆధ్యాత్మికం..



**గోమాతకు పూజలు**



లింగంపేట(ఎల్లారెడ్డి): ముంబోజీపేటతండాకు చెందిన గిరిజనులు సోమవారం గోమాతకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ సంఘటన మంత్రి వినోద్ కుమార్ మాట్లాడారు. హిందూ ఆరాధ్య దైవం ముక్కోటి దేవతలు గోమాతలో విలీనమై ఉన్నందున గోమాత సర్వ రోగ నివారణ యంత్రం లాంటిదన్నారు. గోమాతను కసాయి వారికిచ్చి బలి ఇవ్వకూడదన్నారు. అనంతరం భవానిమాత, సేవాలాల్ మహారాజ్ మందిరాల్లో పూజలు చేశారు. నరేష్ నాయక్, వేణు నాయక్, బజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో సోమావతి అమావాస్య



గోపాల్‌పేటలో రావిచెట్టు వద్ద ప్రత్యేకపూజలు చేస్తున్న మహిళలు



ఎల్లారెడ్డిలో ..

జిల్లాలో పలు గ్రామాల్లో సోమవారం సోమావతి అమావాస్యను మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. రావి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు చెట్టు చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మైలారం గ్రామ రాజేశ్వరాలయంలో..



కామారెడ్డి అర్బన్: సీతారామాంజనేయ స్వామి ఆలయంలో సోమావతి అమ్మవారి కళ్యాణోత్సవం

### సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

రాజంపేట: మండల కేంద్రంలోని నూతన బీసీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బెస్త చంద్రం ఓ ప్రకటనలో తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ఉపాధ్యక్షుడు మేకల నర్సింలు, కిసాన్ సెల్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉన్నారు.

### హైడ్రా కమిషనర్‌తో ఆగ్రోస్ చైర్మన్ భేటీ



బాన్సువాడ : హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను హైదరాబాద్‌లో సోమవారం ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఆగ్రో జనరల్ మేనేజర్ యూసుఫ్, మాజీ జెట్పీటీసీ ప్రదీప్ తదితరులు ఉన్నారు.

### మేనూర్‌లో దేశీదారు పట్టివేత



మద్నూర్(జుక్కల్): మేనూర్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న దేశీదారును పట్టుకున్నామని సోమవారం ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. మేనూర్–డోంగ్లీ రహదారిపై బిచ్కుంద ఎక్సైజ్ ఎస్సై నాగేశ్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా మహారాష్ట్ర నుంచి బైక్‌పై వస్తున్న వ్యక్తి 48 దేశీదారు మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అక్రమంగా దేశీదారు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఎక్సైజ్ సిబ్బంది పరశురాం, శ్రీకాంత్‌లు ఉన్నారు.

### కేజీబీవీ తనిఖీ

బాన్సువాడ రూరల్: కొత్తబాది కేజీబీవీని సోమవారం మండల విద్యాధికారి నాగేశ్వరరావు తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థుల కోసం వండిన ఆహారాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతి పూట భోజనం, స్నాక్స్, చికెన్, మటన్, పండ్లు అందించాలన్నారు. స్టోర్‌రూం తనిఖీ చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని సూచించారు.



### అనుమతి లేకుండా గృహ నిర్మాణం.. వ్యక్తికి నోటీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద అనుమతి లేకుండా గృహ ని ర్మాణం చేపడుతున్న రాజారాం సంజీవులుకు సో మవారం జీపీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 7న అనుమతి లేకుండా ఇల్లు నిర్మాణం చేపట్టవద్దని సూచించినా.. ఇ ల్లు నిర్మాణం కొనసాగిస్తున్నందున అనుమతి తీసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. అలాగే జీపీ స్థలం కూడా కబ్జా చేసుకొని నిర్మాణం చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అదనంగా ఇల్లు నిర్మాణం చేపడుతున్న స్థలం ఖా ళీ చేయాలన్నారు. లేని పక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

### తెలుగు రచయితల మహాసభలో జిల్లా వాసి గొంతుక



మాచారెడ్డి: విజయవాడలో జరిగిన ఆరవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో తొలి రోజు మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన కవయిత్రి కందాళ పద్మావతి పర్యావరణంపై ప్రకృతి గొంతుక నేనై శీర్షికన కవితను వినిపించినట్లు సోమవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పద్మావతికి ప్రశంసా పత్రం అందజేసి శాలువాతో సత్కరించినట్లు వెల్లడించారు.

# మురికి తొలగించకుంటే చర్యలు తప్పవు

- సబ్ కలెక్టర్ కిరణ్మయి



స్థానికులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో గ్రంథాలయం వెనక వీధిలో పారిశుధ్యం పూర్తిగా లోపించిందని, మురికి తొలగించకుంటే చర్యలు తప్పవని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి జీపీ అధికారులకు హెచ్చరించారు. సబ్ కలెక్టర్ సోమవారం చైర్మన్ చంద్రకాంత్ రెడ్డితో కలిసి గ్రంథాయం సందర్శించి వెనక భాగంలో ఉన్న వీధిలో పర్యటించారు. గ్రంథాలయం పక్కన చేపలు, మటన్ షాపులున్నాయి.. దుర్వాసన వస్తుంది.. మురికి నీరు ఇళ్లలోకి చేరుతున్నాయని ప్రజలు సబ్ కలెక్టర్ ముందు వాపోయారు. మురికి చూసి ఒక్కసారిగా సబ్ కలెక్టర్ షాక్ అయ్యారు. వెంటనే జీపీ అధికారులను పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి వీధిలో మురికి కాలువలు శుభ్రం చేసి పారిశుధ్యం లోపించకుండా చూడాలని సూచించారు. పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

### నో పెన్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

బాన్సువాడ/బాన్సువాడరూరల్ : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు నో పెన్షన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి శంకర్ అన్నారు. సోమవారం నిర్వహించిన రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఎటువంటి పెన్షన్ సౌకర్యం లేదని, ఈ విషయంపై 2005లో ఆర్టీసీ యాజమాన్యం, ఉద్యోగులు పదవీ విరమణ పొందగానే ప్రతీ ఉద్యోగికి డిపోల్లో నో పెన్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలని సర్క్యులర్ నంబర్–58 ద్వారా అధికారులకు సూచించిందని గుర్తు చేశారు. 2024 వరకు నో పెన్షన్ సర్టిఫికెట్లు అందజేస్తున్నారని అన్నారు. చాలా రోజుల క్రితమే నో పెన్షన్ సర్టిఫికెట్ ఇవ్వొద్దని ఉన్నతాధికారులు తమకు చెప్పారని బాన్సువాడ డీఎం అంటున్నారని చెప్పారు. ఈ విషయాన్ని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తరపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు కౌసర్, మహమూద్, ఫరీద్ తదితరులున్నారు.

# 'అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి'



లింగంపేట అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు



గతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన జీపీ అధికారులు (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామ పంచాయతీకి కేటాయించిన లేఅవుట్ ప్లాట్లను కబ్జా చేసుకొని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకొని, అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కోరుతూ లింగంపేట గ్రామస్తులు సోమవారం ఆందోళనకు దిగారు. సర్వే నంబర్–1074లో 2.24 ఎకరాల భూమి రంగరి కృష్ణాబాయి 1989లో లేఅవుట్ చేసుకొని గ్రామ పంచాయతీకి 17, 18, 39, 40 నంబర్లు గల ప్లాట్లను కేటాయించారు. ఆ ప్లాట్లను గుట్టు చప్పుడు కాకుండా నలుగురు వ్యక్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ విషయ తెలిసి గ్రామస్తులు అందరూ కలిసి లింగంపేట అంబేడ్కర్ చౌరస్తాలో గంట పాటు రాస్తారోకో, ధర్నా చేశారు. ఈ సందర్భంగా మత్తడి పోచమ్మ ఆలయం కమిటీ గౌరవ అధ్యక్షుడు పోతగోని శంకర్‌గౌడ్ మాట్లాడారు. ప్రస్తుతం నాలుగు ప్లాట్ల విలువ కోటి రూపాయలు ఉంటుందన్నారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎంపీడీవో నరేష్, తహసీల్దార్ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారులు ప్లాట్ల వద్దకు వచ్చి పరిశీలించారు. వెంటనే వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు.

# సోషల్ టాలెంట్ టెస్టులో ప్రతిభ



ఎల్లారెడ్డిరూరల్: అభినందిస్తున్న ఉపాధ్యాయులు



గాంధారి: ఎంపికైన విద్యార్థులు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల స్థాయిలో నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్టులో మోడల్ స్కూల్ విద్యార్థులు మండల టాపర్లుగా నిలిచి, జిల్లా స్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జహంగీర్ సోమవారం తెలిపారు. జెడ్పీ బాలికల పాఠశాలలో నిర్వహించిన టెస్టులో మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు పావని, అంజలిలు, అడివిలింగాల జెడ్పీ పాఠశాలకు చెందిన నాగలక్ష్మి, జెడ్పీ బాలికల పాఠశాలకు చెందిన మహేశ్వరిలు మండల టాపర్లుగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.

**గాంధారి నుంచి ఆరుగురు..**

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల(పేట్‌సంగెం)కు చెందిన గురుదేవ్, కూచి సాయిచరణ్, సాయి నితిన్, చద్మల్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బి. స్రవంతి, రోజా, బి. ప్రియాంకలు సోషల్ టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

**భిక్కనూరు విద్యార్థులు ..**

భిక్కనూరు: భిక్కనూరు బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్ట్‌లో జంగంపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.సహస్ర, డి. మనూష, భిక్కనూరు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన వి.మహేష్, డి.వరలక్ష్మి, స్వర్ణదీపికలు భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పి.స్ఫూర్తిలు ప్రతిభ చూపి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. వీరందరిని ఎంఈవో రాజగంగారెడ్డి అభినందించారు.

**నిజాంసాగర్ నుంచి**

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మండల స్థాయి సోషల్ ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు ఎంఈవో తిరుపతిరెడ్డి తెలిపారు. అంజన సౌమ్య, భానుప్రియ, దీపక్ ప్రతిభ చూపారు. విద్యార్థులను విద్యా శాఖాధికారులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎంఈవో అమర్‌సింగ్, హెచ్‌ఎం రాంచందర్, సమత ఉన్నారు.



భిక్కనూరు: అభినందిస్తున్న ఎంఈవో రాజగంగారెడ్డి



నిజాంసాగర్: అభినందిస్తున్న ఉపాధ్యాయులు